క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోవాలి

డిండి : మండల కేంద్రంలోని ఐటీఐ(ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ), అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్(ఏటీసీ)లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎలక్ట్రీసియన్, ఫిట్టర్, కొత్త కోర్సులకు పదో తరగతి ఉత్తీర్ణులై 14 ఏళ్లు నిండిన ప్రతి విద్యార్థి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

సేంద్రియ ఎరువుల వినియోగంపై నేడు సదస్సు

నిడమనూరు : సేంద్రియ ఎరువుల వాడకంపై శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వ్యవసాయశాఖ అధికారి ఎం మునికృష్ణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖ, మద్రాస్ ఫర్టిలైజర్స్ ఆధ్వర్యంలో రైతు వేదికలో రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు జిల్లా వ్యవసాయ అధికారి, శ్రావణ్ కుమార్, హాలియా సహాయ వ్యవసాయ సంచాలకులు సరిత, మద్రాస్ ఫర్టిలైజర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మిర్యాలగూడ మేనేజర్ రామారావు అవగాహన సదస్సుకు రానున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని తడకమళ్లలో ఆర్టీసీ బస్సు దహనం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తడకమళ్ల గ్రామ ఉద్యోగుల వేదిక గురువారం ఒక ప్రకటనలో పోలీసులను కోరింది. ప్రభుత్వ రంగ సంస్థలను దహనం చేయడం సరైంది కాదన్నారు. గ్రామానికి మాయని మచ్చగా ఉంటుందన్నారు. బస్సు తగలపెట్టిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపించి అందుకు బాధ్యులు ఎంతటి వారైనా సరే కఠినంగా శిక్షించాలని ఈ వేదిక నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పుండరీచారి, అనిల్‌రెడ్డి, రాంబాబు, కృష్ణ, వెంకటరమణ, జానకిరామయ్యలు అధికారులను కోరారు.

ఇంట్లో చోరీ

చింతపల్లి: చింతపల్లి మండలం ప్రశాంతపూరి తండాలోని ఓ ఇంట్లో గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రశాంతపూరి తండాకు చెందిన ఇస్లావత్ శ్రీను బుధవారం రాత్రి భోజనం చేసిన అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి పైన పెంట్‌హౌస్‌లో నిద్రించారు. గురువారం తెల్లవారుజామున లేచి చూసేసరికి ఇంట్లో ఉన్న బీరువా తాళాలు పగులగొట్టి కనిపించాయి. బీరువాలో ఉన్న 3తులాల బంగారం, పట్టా గొలుసులతో పాటు నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నల్లగొండ నుంచి క్లూస్‌టీంను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బత్తాయి మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న ఉద్యాన కేంద్ర అధికారులు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని చిన్న అడిశర్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన పరిశోధన కేంద్రంలో షెడ్యూల్ ఉప కులాల రైతులకు ఒక్కొక్కరికి 25 బత్తాయి మొక్కలను గురువారం పంపిణీ చేశారు. వాటితో పాటు కిచెన్ గార్డెన్ కిట్స్, లింగాకర్షక బుట్టలు అందజేసినట్లు ఆ పరిశోధన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ సీహెచ్ రాజాగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ క్లస్టర్ ఉద్యాన అధికారి రవినాయక్, కైరత్ అలీ మరియు సౌమ్య పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించడంపై హర్షం

మాదుగులపల్లి : మండలంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు లేకపోవడంతో ఆ గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. మండలంలోని కుక్కడం నుంచి పాములపాడుకు వెళ్లాలంటే 19కిలోమీటర్లు ఆటోలో ప్రయాణించాలి. తమ గ్రామానికి బస్సు సర్వీస్ నడపాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి సమస్యను వివరించగా స్పందించి ఎమ్మెల్యే వెంటనే ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించారు. దీంతో గురువారం నుంచి బస్సు సర్వీస్ మొదలయ్యాయి. ఆయా గ్రామల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ అర్బన్ : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి ఎండీ సయ్యద్ మాట్లాడుతూ.. సెంట్రల్ కిచన్ విధానం ద్వారా పాఠశాల వంట కార్యక్రమాన్ని ప్రైవేట్ సంస్థకు అప్పగించే విధానాన్ని విరమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు రాజేశ్వరి, లీలావతి, సరళ, పద్మ, లక్ష్మి, వజయలక్ష్మి, వెంకటమ్మ, సుజాత, ఎల్లమ్మ ఉన్నారు.

ఈ వంతెనపై నుంచి వెళ్లేదెలా!

- పూల్యాతండా వద్ద ఏఎమ్మార్పీ కాల్వ బ్రిడ్జిపై నిలుస్తున్న వర్షపు నీరు
- ఇబ్బందులు పడుతున్న తండావాసులు



వంతెనపై నిలిచిన నీళ్లలో నుంచి పశువులను తోలుకెళ్తున్న రైతులు

పెద్దవూర : మండలంలోని పూల్యాతండా వద్ద నిర్మించిన వంతెనపై నిత్యం నీళ్లు నిలుస్తున్నాయి. దీంతో ప్రజలకు నడవటానికి కష్టంగా మారింది. పూల్యాతండాను ఆనుకుని ఏఎమ్మార్పీ లో లెవెల్ వరద కాల్వను నిర్మించారు. దీంతో తండావాసులు కాల్వ అవతలి వైపు వున్న వ్యవసాయ పొలాలకు వెళ్లటానికి కిలో మీటరు మేర ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి దాపురించింది. ఏఎమ్మార్పీ అధికారులతో తండావాసులు ఈ విషయమై మొరపెట్టుకోవడంతో పూల్యాతండా వద్ద ఎనిమిదేళ్ల క్రితం వంతెనను నిర్మించారు. ఈ వంతెనను రోడ్డుకు నాలుగైదు అడుగుల లోతులో నిర్మించారు. దీంతో ఏఎమ్మార్పీ నీళ్లు, తండాలోని వృథానీరు, వ్యవసాయ పొలాల నుంచి వచ్చే వాననీరు అంతా వంతెనపై నిలిచి మురుగుగుంతలాగా తయారై మోకాళ్ల లోతు నీళ్లు నిలుస్తున్నాయి. వర్షాకాలంలో వంతెనపై నిత్యం నీళ్లు నిలుస్తుండటంతో వంతెనపై నుంచి వెళ్లే పరిస్థితి ఉండదు. వ్యవసాయ పంట పొలాలకు వెళ్లాలంటే రైతులు మోకాళ్ల లోతు నీటిలోనుంచి పశువులను తోలుకుంటూ, తాము తడుస్తూ వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళా రైతులు, కూలీలదైతే పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఏఎమ్మార్పీ లో లెవెల్ వరద కాల్వ హెడ్‌రెగ్యులేటర్, పంప్ హౌజ్ వద్దకు వెళ్లాలంటే కూడా మోకాళ్లలోతు నీళ్లలోనుంచి వెళ్లాల్సిందే. రైతులు సైతం తమ పశువులను తోలుకుని ఈ నీటిలో నుంచి తడుస్తు వెళ్తున్నారు. దీంతో ద్విచక్ర వాహనాలు ఈ నీటిలో ఆగిపోయి సైలెన్సర్లలోకి నీరు పోయి చెడిపోతున్నాయి. ఈ వంతెనపై నీరు నిల్వ ఉండకుండా ఎత్తుగా కంకర పోసి ప్లాస్టింగు చేయాలని తండావాసులు, వాహనదారులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



ఏఎమ్మార్పీ వరద కాలువపై నిర్మించిన ఇరుకు వంతెనపై వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. వర్షాకాలంలో నిత్యం మోకాళ్ల లోతులో నీరు నిలిచి ఉంటుంది. పంట పొలాలకు వెళ్లాలంటే నీళ్లలో నుంచే పశువులను తోలుకుని వెళ్తున్నాము. వంతెనపై నిలిచిన నీరు ఎటు పోవడానికి లేకపోవడంతో మురికికూపంగా మారి దుర్వాసన వస్తుంది. చెప్పులు చేతపట్టుకుని, బట్టలు మోకాళ్లపైకి లేపుకుని వెళ్తున్నాము. మహిళల పరిస్థితి దారుణంగా ఉంది. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నోసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు.

– రమావత్ సేవానాయక్, పూల్యాతండా

ఎరువులు అధిక ధరకు విక్రయించొద్దు



హాలియా : పట్టుకున్న ఎరువులతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

హాలియా : ఎరువుల దుకాణ యజమానులు ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం రైతులకు ఎరువులు విక్రయించాలని, తమ ఇష్టానుసారంగా విక్రయిస్తే చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎస్‌కె గౌస్ అన్నారు. గురువారం అనుముల మండలంలోని చల్మారెడ్డి గూడెంలో పల్లవి ఆగ్రోట్రేడర్స్ ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని స్థానిక అధికారులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా దుకాణాల్లో ఉన్న యూరియా, ఇతర ఎరువుల నిల్వలను, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. దుకాణంలో ఎలాంటి బిల్లులు లేకుండా 264 బస్తాల యూరియా, కొన్ని కాలం చెల్లిన పురుగు మందులు ఉన్నట్లు గుర్తించారు. సదరు డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఏఓ ముని కృష్ణ, కానిస్టేబుల్ నర్సింహారెడ్డి, వెంకన్న, రఫీ తదితరులు ఉన్నారు.

ఎరువులు అధిక ధరకు అమ్మితే కఠిన చర్యలు

అడవిదేవులపల్లి : ఎరువులను అధిక ధరలకు అమ్మితే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, అడవిదేవులపల్లి మండల ప్రత్యేక అధికారి టి.వెంకటేశం హెచ్చరించారు. గురువారం స్థానిక అధికారులతో కలిసి పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం ఎరువులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆయన వెవెంట ఎంపీడీఓమాతంగి రమేష్, మండల వ్యవసాయ అధికారిని గుర్రం సరిత, ఎంపీఓ మెసిస్‌బిన్ అహ్మద్ తదితరులున్నారు.

పౌరసరఫరాల గోదాం పరిశీలించిన సబ్ కలెక్టర్



గోదాంలోని స్టాక్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ : పట్టణంలోని పౌర సరఫరాల స్టాక్ పాయింట్‌ను సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గోదాంలోని బియ్యం నిల్వలను పరిశీలించి మాట్లాడారు. సాంఘిక సంక్షేమ, ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాలకు, చౌకధరల దుకాణాలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని గోదాంలో పనిచేసే సిబ్బందిని ఆదేశించారు. బుజుపట్టిన, పురుగులు పడ్డ బియ్యం ఉంటే సరఫరా చేయకుండా పక్కకు పెట్టాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ సురేష్‌కుమార్ ఉన్నారు.

పాఠశాలల్లో గ్రంథాలయాలు తప్పనిసరి

గుర్రంపోడు : పాఠశాలల్లో విద్యార్థులకు గ్రంథాలయ పుస్తక పఠనం తప్పరిసరిగా నిర్వహించాలని మండల విద్యాధికారి నోముల యాదగిరి అన్నారు. గురువారం మండలంలోని కొప్పోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలలకు అందించిన కథల పుస్తకాలను విద్యార్థులతో ప్రతి రోజూ చదివించడం ద్వారా వారిలో చదవడం అనే సామర్థ్యం పెరిగి ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో మొదటి సోపానాన్ని సాధించినట్లవుతామన్నారు. గ్రంథాలయానికి పాఠశాలల్లో తరగతి గదిలో రీడింగ్ కార్నర్‌లు ఏర్పాటు చేసి ఆకర్షణీయంగా ఉంచాలన్నారు. గ్రంథాలయ నిర్వహణకు సంబంధించి మూడు రకాల రిజిస్టర్లను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిట్టలగూడెం కాంప్లెక్స్ హెచ్ఎం ఎస్.యాదయ్య, రిసోర్స్ పర్సన్‌లు ఎం.మాలతి, కె. మధుసూదన్, ఎం.రాము, యాదగిరి , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల వినియోగం పెరగాలి

చింతపల్లి : విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు ప్రతి పాఠశాలలో గ్రంథాలయాల వినియోగం పెరగాలని ఎంఈఓ నీరుడు అంజయ్య సూచించారు. గురువారం స్కూల్ కాంప్లెక్స్ మొదటి సమావేశం ఘడియ గౌరారం హైస్కూల్‌లో అంజయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు విధిగా గ్రంథాలయ పుస్తకాలు చదించడానికి ప్రత్యేక పీరియడ్ కేటాయించాలని సూచించారు. ప్రతి పాఠశాలలో పఠనోత్సవ కార్యక్రమాలను నిర్వహించాలని విద్యార్థులతో గ్రంథాలయ పుస్తకాలను చదివించాలని తెలిపారు. గంథాలయ పుస్తకాల వినియోగంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి కాంప్లెక్స్ హెడ్మాస్టర్ లక్ష్మి, వీటీ నగర్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ కృష్ణమ్మ, రిసోర్స్ పర్సన్‌లు కృష్ణారెడ్డి, సుగుణ, ప్రభాకర్ రెడ్డి, ప్రాథమికోన్నత, ప్రాథమిక హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ అంజయ్య

‘వలస కార్మికులతో సంబంధం లేదు’

చందంపేట : నేరెడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీలో ఇటీవల పోలీసుల దాడిలో వెలుగు చూసిన వలస కార్మికుల నిర్బంధం, శ్రమ దోపిడీ ఘటనతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆ కాలనీకి చెందిన చేపల బంగారి పేర్కొన్నారు. గురువారం స్థానికంగా మాట్లాడుతూ ఈ ఘటనతో తనకు ఎలాంటి సంబంధం లేకున్నప్పటికీ తన పేరు లాగుతున్నారన్నారు. పోలీసుల విచారణకు పూర్తి సహకారం అందిస్తానన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ బాలుడిని రాము అనే వ్యక్తి కొట్టి గాయపర్చడంతో తమ గ్రామస్తులతో కలిసి వెంకటరమణ అనే బాలుడిని తనవద్దకు చేరదీసి ఆశ్రయం కల్పించానే తప్ప అతనిని నిర్బంధించలేదని, చాకిరి చేయించుకోలేదని పేర్కొన్నారు. తనతో పాటు మార్క్, బంగారి, నూక రాజు, హరి, మాత్రు, సరియ, మోహన్ మరికొంత మందితో కలిసి బాలుడిని సంరక్షించినట్లు తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కొండమల్లేపల్లి : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ నరేందర్‌కు గురువారం ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీయస్.యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బక్కా శ్రీనివాసా చారి, జిల్లా ఆడిట్ సభ్యులు భానుప్రకాష్, కొండమల్లేపల్లి మండల అధ్యక్షులు సంజీవకుమార్, ప్రధాన కార్యదర్శి జి.చినముత్యాలు, గౌరవ అధ్యక్షుడు శ్రీదేవి, శోభారాణి నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏ, పీఆర్సీలను ప్రకటించాలి

కొండమల్లేపల్లి : పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీలను వెంటనే ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం టీపీయూఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కట్టెబోయిన శ్రీనివాస్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా కొండమల్లేపల్లిలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా రెండేళ్లుగా ప్రకటనకు నోచుకోని పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, హెచ్ఎంల పదోన్నతులను వెంటనే చేపట్టాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు పే స్కేల్ వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొమిర సైదులు, బద్దెల అంజయ్య, జిల్లా బాధ్యులు కల్లాల సంతోష్‌రెడ్డి, లెండాల వినోద్, వరలక్ష్మి, జ్యోతి, సరస్వతి, పరమేష్, రామలింగయ్య, శ్రీధర్, గీతాంజలి, శ్రీకాంత్‌రెడ్డి, అంకం శ్రీనివాస్, దాసోజు గణేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

కేటీఆర్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్

దేవరకొండ : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను గురువారం పార్టీ జిల్లా అధ్యక్షుడు , దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంకణాల వెంకట్‌రెడ్డి, టీవీఎన్ రెడ్డి, సుభాష్‌గౌడ్, గాజుల ఆంజనేయులు, రవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



దేవరకొండ : బస్టాండ్ వద్ద మొక్క నాటుతున్న మున్సిపల్ కమిషనర్



డిండి : మొక్క నాటుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

దేవరకొండ : పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని దేవరకొండ మున్సిపల్ కమిషనర్ వై.సుదర్శన్ అన్నారు. గురువారం వన మహోత్సవంలో భాగంగా పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద మొక్కలు నాటి ఆయన మాట్లాడారు. వన మహోత్సవంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో విరివిగా మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించినట్లు తెలిపారు. అంతేగాకుండా ఇంటింటికి మొక్కలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, మేనేజర్ రాకేష్, సక్య నాయక్, జగమంతు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో వన మహోత్సవం

డిండి : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో నాటిన మొక్కల సంరక్షణకు విద్యార్థులు బాధ్యత తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సంతోష్‌కుమార్, కృష్ణయ్య, అధ్యాపకులు పాండురంగయ్య, ఆంజనేయులు, శ్రీరాములు, హన్మంతు,లింగస్వామి పాల్గొన్నారు.

భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్



గుర్రంపోడు : తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

గుర్రంపోడు : భూ భారతి దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి నివేదికను ఆర్డీఓకు అందజేయాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రెవెన్యూ అధికారులతో భూ భారతిపై సమీక్ష నిర్వహించారు. భూ భారతిలో వచ్చిన 2150 దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన వేగవంతం చేయాలని ఆయన సూచించారు. దరఖాస్తుల ఆన్‌లైన్, నోటీసులు అందించడం లాంటి పక్రియలు పూర్తి చేసి క్షేత్రస్థాయి విచారణలు జరుపుతున్నామని అధికారులు వివరించారు. ఈ సమావేశంలో దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐలు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి భూభారతి

చింతపల్లి : ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి భూభారతి తీసుకువచ్చిందని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి కార్యాలయంలో భూభారతి కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మండల పరిధిలోని వర్కాల, పోలేపల్లి రాంనగర్ గ్రామాలలోని పునరావాస భూములను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, తహసీల్దార్ రమాకాంత్ శర్మ, డిప్యూటీ తహసీల్దార్ హర్షద్, ఆర్ఐ సునీత తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

దేవరకొండ : ఓటరు నమోదుపై రాజకీయ పార్టీలు సైతం అవగాహన కల్పించాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి అన్నారు. గురువారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. త్వరలో జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు సహకరించాలని ఆయన కోరారు .దేవరకొండ నియోజకవర్గంలో 1200ఓట్లు ఉన్న పోలింగ్ సేషన్లకు అదనంగా మరో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు 1200 ఓట్ల కన్నా ఎక్కువ ఉన్న 42పోలింగ్ స్టేషన్లను గుర్తించగా 28 కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఆయా పార్టీలు ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల డీటీ ముబీన్, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కుల నిర్మూలనే గుర్రం జాషువాకు నివాళి



హాలియా : నాయుడుపాలెంలో జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నాగార్జునసాగర్ : కుల నిర్మూలనే గుర్రం జాషువాకు నిజమైన నివాళి అని కస్తూరి ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రముఖ కవి గుర్రం జాషువా వర్ధంతిని పురస్కరించుకొని గురువారం నందికొండ మున్సిపాలిటీలో దాసి సుదర్శన్ స్మారక చిత్ర కళానిలయం ఆధ్వర్యంలో బీసీగురుకులం, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చిత్రకళా ప్రదర్శన నిర్వహించి, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు పెట్టారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని కళాభారతి సమావేశ మందిరంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభాకర్ మాట్లాడుతూ శతాబ్దం క్రితమే గుర్రం జాషువా వైవిధ్యమైన రచనలతో సమాజంలో చైతన్యానికి ప్రతీకగా నిలిచాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మట్టి మనిషి పాండురంగారావు, దాసి సుదర్శన్ సతీమణి స్వతంత్రమ్మ, స్వతంత్రబాబు, ట్రస్ట్ అధ్యక్షులు మోహన్‌రాజు, బాలీశ్వర్, కిరణ్మయి పాల్గొన్నారు.

కవిత్వాన్ని ఆయుధంగా మల్చుకుని..

హాలియా : కవిత్వాన్ని ఆయుధంగా మల్చుకుని మూఢాచారాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప కవి గుర్రం జాషువా అని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మందా సైదులురావు గౌతమ్ అన్నారు. మహాకవి గుర్రం జాషువా 54వ వర్ధంతి వేడుకలను గురువారం మండలంలోని నాయుడుపాలెంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జాతీయ కబడ్డీ క్రీడాకారుడు యడవెల్లి రాంబాబు, సీఆర్‌పీ శ్రీనివాస్, దేవిక, వెంకన్న, నాగార్జున, పరుశురాం, నాగార్జునచారి ఉన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

హాలియా : బాల్య వివాహాలకు అరికట్టాలని డీడబ్ల్యూఓ కేవీ కృష్ణవేణి అన్నారు. అనుముల ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కొత్తపల్లి రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్స్‌కు నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా చదివించాలన్నారు. బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. బాల్య వివాహాలు నిరోధించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. శిశు మరణాలు జరగకుండా అంగన్‌వాడీ టీచర్లు గ్రామాల్లోని తల్లులకు అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలు పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం పిల్లల ఎత్తు బరువులు, తల్లులకు పోషణ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ జరుగుతున్న బాలమృతం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ఉదయశ్రీ, ఏసీడీపీఓ సువర్ణ, డీసీ సతీష్, బీసీ పవన్, సూపర్‌వైజర్లు రమాదేవి, సరిత, సైదాబేగం , వెంకాయమ్మ, ఫరీదా. యాదమ్మ, శశికళ, అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ కేవీ కృష్ణవేణి

తిరుగు పయనంలో గొర్రెల మందలు



జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై గుంపులుగా వెళ్తున్న గొర్రెల మంద

పెద్దవూర : తీవ్ర వర్షాభావ పరిస్థితులలో పశుగ్రాసం దొరకక మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు జిల్లాల నుంచి గొర్రెల కాపరులు తమ స్వగ్రామాల నుంచి తమ గొర్రెల మందలను తోలుకుని మేపుకుంటూ నాగార్జునసాగర్ ప్రాజెక్టు కింద ఆయకట్టు ప్రాంతానికి ఆరు నెలల క్రితం వలస వచ్చారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటం, నార్లు పోసి, నాట్లు వేస్తుండటంతో తమ గొర్రెలను మేపుకుంటూ గొర్రెల మందలతో కాపరులు స్వగ్రామాలకు తిరుగు పయనమయ్యారు. ఒక్కో గొర్రెల మందలో వందకు పైగా జీవాలు ఉన్నాయి. ముసురుతో కూడిన వర్షంలోనూ గొర్రెల మందలు రోడ్లపై వెళ్తున్నాయి. జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారితో పాటు, హైదరాబాద్-నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై ఒకేసారి గొర్రెల మందలు వెళ్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. గొర్రెలు మందలు మందలుగా వెళ్తుండటంతో ప్రధాన రహదారి అంతా గొర్రెలు, వాహనాలతో బారులుదీరుతున్నాయి.

భిక్షం సేవలు మరువలేనివి

మిర్యాలగూడ : మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన రావులపెంట భిక్షం బీఆర్ఎస్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ యువ నాయకుడు నల్లమోతు సిద్ధార్థలు అన్నారు. గురువారం భిక్షం వర్ధంతి సందర్భంగా ఆయన స్మారక స్థూపం వద్ద వారు నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ధనావత్ చిట్టిబాబునాయక్, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, బారెడ్డి అశోక్‌రెడ్డి, విద్యాసాగర్, రమావత్ భీమ్లానాయక్, చిన్నం రమేష్‌బాబు, మనోహర్, చందుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి

మోడల్ స్కూల్‌లో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌లో విజయం సాధించిన విద్యార్థులతో అధ్యాపకులు

మిర్యాలగూడ అర్బన్ : మండలంలోని తుంగపాడు మోడల్ స్కూల్ విద్యార్థులకు గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు. కళాశాల హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ఎన్నిక కోసం నిర్వహించిన మాక్ పోలింగ్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎల్.రజిత మాట్లాడుతూ విద్యార్థులు పీఓ, ఏపీఓ, ఏపీఓ, పోలింగ్ ఏజెంట్లుగా విధులు నిర్వహించారని, మాక్ పోలింగ్‌తో విద్యార్థులు అవాహన పెంచుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, కోటి, లీలా, దేవి, రవీంద్ర, వెంకట్‌రెడ్డి, విద్యాసాగర్, షమీమ్, వెంకటచారి, నాగేందర్ రెడ్డి, జగన్, సైదులు, గోపి, సావిత్రి విజయలక్ష్మి పాల్గొన్నారు.